# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 03-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభలలో ఈరోజు చర్చ జరిగింది.

- ❖ ఢిల్లీలో శాసనసభ ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రం ముగిసింది.

- ❖ భారత రైల్వే ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ లో 2 లక్షల 52 వేల 200 కోట్ల రూపాయలను కేటాయించినట్లు కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

- ❖ ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దేశవ్యాప్తంగా 6 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం తెలిపింది.

- ❖ ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో, పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో జోనాథన్ గావిన్ ఆంటోనీ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు.

==========================

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ఉభయ సభలలో ఈరోజు చర్చ జరిగింది. భారతీయ జనతా పార్టీ నాయకులు రాంవీర్ సింగ్ బిధూరి ఈ తీర్మానాన్ని ముందుకు తెస్తూ… నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన వంటి వివిధ కేంద్ర పథకాలను ఢిల్లీలో అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. రాజ్యసభలో జరిగిన చర్చను బిజెపి సభ్యులు కిరణ్ చౌదరి ప్రారంభిస్తూ.. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు ప్రభుత్వం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు.

==========================

ఢిల్లీలో శాసనసభ ఎన్నికల ప్రచారం ఈరోజు సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 70 శాసనసభా స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుంది. చివరి రోజున అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం సాగించాయి. మరోవైపు ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. భద్రత చర్యల్లో భాగంగా 200 కంపెనీలకు పైగా సాయుధ బలగాలు, 15 వేల మంది హోంగార్డులు, 35 వేల మంది ఢిల్లీ పోలీసుల అధికారులు వినియోగించనున్నారు. 3 వేల పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించిన ఎన్నికల అధికారులు, డ్రోన్లతో పర్యవేక్షించనున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రద్దీని తెలుసుకునేందుకు క్యూ మేనేజిమెంట్ సిస్టమ్‌ను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెడుతున్నారు.

==========================

ఢిల్లీ శాసన సభ, అలాగే ఉత్తరప్రదేశ్, తమిళనాడులలో ఒక్కొక్క స్థానానికి జరిగే ఉప ఎన్నికలపై ఓటింగ్ రోజున ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల 30 నిమిషాల వరకు ఎగ్జిట్ పోల్స్ పై ఎన్నికల సంఘం నిషేధం విధిస్తూ.. ఈ రోజు ఒక ప్రకటన విడుదల చేసింది. టెలివిజన్ ఛానెల్‌లు, రేడియో స్టేషన్లు, వార్తా ఏజెన్సీలతో సహా అన్ని పత్రికా కేంద్రాలు ఎన్నికల నియమాలను పాటించాలని కమిషన్ ఆదేశించింది. ఓటింగ్ ముగిసే 48 గంటలలో ప్రసారమయ్యే అభిప్రాయ సేకరణలు సర్వే ఫలితాలకు కూడా ఈ నిషేధం వర్తింపజేసింది.

==========================

భారత రైల్వే ను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు బడ్జెట్లో 2 లక్షల 52 వేల 200 కోట్ల రూపాయలను కేటాయించామని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన పత్రికా సమేవశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.... రైల్వేలో భద్రతా ప్రమాణాలను పెంచేందుకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహన దారులందరికీ ఒకేరకమైన టోల్ విధానం అమలయ్యేలా 'ఏకరీతి టోల్ విధానం'పై కసరత్తు చేస్తున్నామని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఢిల్లీలో ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ లో ఆయన మాట్లాడుతూ... సామాజిక మధ్యమాలలో రోడ్లపై వచ్చే ఫిర్యాదులను తీవ్రంగా పరిగణిస్తామని, సంబంధిత గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 2020-21లో సగటున రోజుకు 37 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరిగిందని.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 7 వేల కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం జరిగిందని ఆయన వెల్లడించారు.

==========================

గత రెండేళ్లలో దేశంలో విదేశీ పర్యాటకుల సంఖ్య 47.9 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ మేరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఈరోజు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న పర్యాటక ప్రోత్సాహక చర్యల వల్ల ఈ వృద్ధి సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఐకానిక్ టూరిస్ట్ సెంటర్ల అభివృద్ధికి మూలధన పెట్టుబడి కోసం ప్రత్యేక సహాయంగా 23 రాష్ట్రాల్లో 40 ప్రాజెక్టులకు 3 వేల 200 కోట్ల రూపాయలు కేటాయించామని వెల్లడించారు.

విరామం

==========================

ఉత్తరప్రదేశ్ లోని నోయిడాలో నిర్మాణంలో ఉన్న జేవార్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వచ్చే ఏప్రిల్ నెలలో సాధారణ విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈరోజు రాజ్యసభలో మంత్రి మాట్లాడుతూ... ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే విమానాశ్రయం నిర్మాణం జరుగుతోందని స్పష్టం చేశారు. సాంకేతిక లోపాలు, భద్రతా సమస్యలను తగ్గించడానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాయని మంత్రి వివరిస్తూ....

(వాయిస్ 38 సెకన్లు)

==========================

గత ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగిత రేటు 3.2 శాతానికి తగ్గిందని కేంద్ర ప్రభుత్వం లోక్‌సభకు తెలియజేసింది. కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈరోజు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, తాజా కార్మిక సర్వే ప్రకారం, 15 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో నిరుద్యోగం రేటు తగ్గిందని సూచించినట్లు తెలిపారు. ఉపాధిని పెంపొందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు, కార్యక్రమాలను అమలు చేసిందని, రాబోయే 5 సంవత్సరాల్లో 4 కోట్ల మందికి పైగా యువతకు ఉపాధి, నైపుణ్య అవకాశాలను కల్పించేందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ప్యాకేజీ కింద 5 పథకాలను ప్రకటించామని మంత్రి పేర్కొన్నారు.

==========================

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకానికి దేశవ్యాప్తంగా 6 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని ప్రభుత్వం తెలిపింది. లోక్‌సభలో ఈరోజు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో, పైలట్ పథకం కింద  భాగస్వామ్య సంస్థలు ఇప్పటివరకు 1.27 లక్షలకు పైగా ఇంటర్న్‌షిప్‌లను అందించాయని చెప్పారు. మొదటి దశలో 80 వేలకు పైగా ఇంటర్న్‌షిప్ అందించాయని, వాటిని 28 వేలకు పైగా అభ్యర్థులు అంగీకరించారని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం జనవరి 9న పథకం రెండవ దశ ప్రారంభమైందని మంత్రి వివరించారు.

==========================

వసంత పంచమి సందర్భంగా, ఈరోజు ఆకాశవాణి  'హర్ కంఠ మే భారత్' పేరుతో రేడియో ధారావాహికను ప్రారంభించింది. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అరుణీష్ చావ్లా, ప్రసార భారతి CEO గౌరవ్ ద్వివేది దృశ్యామధ్యమ విధానంలో దీనిని ఆవిష్కరించారు. భారతీయ శాస్త్రీయ సంగీతం యొక్క వైవిధ్యాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న శ్రోతలకు పరిచయం చేసే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని రూపొందించామని అధికారులు తెలిపారు. ఫిబ్రవరి 16 వరకు ప్రతిరోజూ ఈ ధారావాహిక దేశంలోని 21 రేడియో కేంద్రాల నుంచి ప్రసారం కానుందని పేర్కొన్నారు.

==========================

ఉత్తరాఖండ్ జాతీయ క్రీడల్లో, పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో కర్ణాటకకు చెందిన 15 సంవత్సరాల జోనాథన్ గావిన్ ఆంటోనీ బంగారు పతకాన్ని గెలుచుకున్నాడు. ఆంటోనీ 240.7 పాయింట్లు సాధించగా, సర్వీసెస్‌కు చెందిన రవీందర్ సింగ్ 240.3 పాయింట్లతో రజతం కైవసం చేసుకున్నాడు. ప్రస్తుతం సర్వీసెస్ 17 స్వర్ణాలు, 10 రజతాలు, 8 కాంస్య పతకాలతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండగా, కర్ణాటక 17 స్వర్ణాలు, 9 రజతాలు, 9 కాంస్య పతకాలతో రెండో స్థానంలో ఉంది.

==========================
==========================